TGTEL/26/A0372

# మన మహతి న్యూస్

## తెలుగు దిన పత్రిక

ఎడిటర్ :డాక్టర్. ప్రకాష్ జాదవ్ | ఆదివారం మే 24, 2026 | సంపుటి : 01 సంచిక : 115 | పేజీలు 5 వెల-2/- MANAMAHATINEWS.COM

# ప్రధాని మోదీతో అమెరికా

## విదేశాంగ మంత్రి రూబియో భేటీ

- ప్రధాని మోదీతో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భేటీ
- సేవా తీర్థ్‌లో గంటకు పైగా కీలక చర్చలు
- భద్రత, వాణిజ్యం, సాంకేతిక రంగాలపై సహకారం పెంపు
- ఇండో-పసిఫిక్ వ్యూహంపై ఫలవంతమైన చర్చలు
- కోల్‌కతాలో మదర్ థెరీసాకు రూబియో నివాళులు
- మే 26న ఢిల్లీలో జరిగే క్వాడ్ సమావేశంలో పాల్గొననున్న రూబియో
- క్వాడ్‌లో భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా సభ్యదేశాలు



నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో.. ప్రధాని మోదీ తో సమావేశమయ్యారు. సేవా తీర్థ్ (పీఎంవో)లో సుమారు గంటకు పైగా వీరి భేటీ కొనసాగినట్లు సమాచారం. భద్రత, వాణిజ్యం, కీలక సాంకేతిక రంగాల్లో ఇరు దేశాల సహకారాన్ని మరింత పెంపొందించడంపై చర్చలు జరిపినట్లు భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడించారు. అంతేకాకుండా స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్‌ను ముందుకు నడిపించే మార్గాలపైనా ఫలవంతమైన చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు.

పేజి 2లో ▶

# పదేళ్ల బాలిక హత్యోదంతం..

## స్పందించిన సీఎం విజయ్



మిగతాది 2లో

కోయంబత్తూర్ లోని దుకాణానికి వెళ్లి అదృశ్యమైన 10 ఏళ్ల బాలిక దారుణ హత్యకు గురైన ఘటన తమిళనాట కలకలం రేపింది. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే కార్తీక్, మోహన్ రాజ్ అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ ఘటనను తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి అమానవీయ చర్యలను సమాజం ఎన్నటికీ అంగీకరించబోదన్నారు.

## మోదీ గిఫ్ట్‌గా ఇచ్చిన తామరాకు టీ వెనక స్టోరీ తెలుసా?



ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఐదు దేశాల పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. మన దేశ సంస్కృతి, జీవనవిధానం, వారసత్వ సంపదను ప్రతిబింబించేలా ఆయా దేశాల అధినేతలకు కానుకలు ఇచ్చారు. వాటిలో లోక్‌తక్ లోటస్ టీ ఒకటి. ఈశాన్య రాష్ట్రమైన మణిపుర్‌లో ప్రత్యేకంగా తయారు చేసే ఈ టీ పౌడర్‌ను స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టెర్సన్‌కు కానుకగా అందజేశారు. పేజి 2లో ▶

# 50 అత్యంత వేడి నగరాలు భారత్‌లోనివే



మిగతాది 2లో

- ప్రపంచంలో అత్యంత వేడి 50 నగరాలన్నీ భారత్‌లోనే నమోదు
- ఏక్యూఐ గణాంకాల్లో షాకింగ్ వివరాలు వెలుగులోకి
- జాబితాలో సగం నగరాలు ఉత్తర్‌ప్రదేశ్‌కే చెందినవి
- తెలంగాణ, ఆంధ్రా సహా పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతల ఉద్ధృతి
- రానున్న వారం రోజుల పాటు తీవ్ర వడగాలుల హెచ్చరిక
- తెలుగు రాష్ట్రాల్లోనూ ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ సూచనలు

# గోదావరి పుష్కరాలకు వేయికోట్లు

వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో.. సంబంధిత పనులకు రూ.వెయ్యి కోట్ల కేటాయిస్తూ తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరుకు పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, పాలు అందించాలని నిర్ణయించింది. అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ సెంటర్ల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లాను ఎంపిక చేసింది. కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరుకు అంగీకారం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ శనివారం భేటీ అయ్యింది. రాష్ట్రానికి సంబంధించి పలు అంశాలపై మంత్రిమండలి చర్చించింది. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లోనూ విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించాలని మంత్రిమండలి నిర్ణయించింది. 2027 గోదావరి పుష్కరాల పనులకు రూ.1,000 కోట్లు కేటాయిస్తూ తెలంగాణ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. తొలివిడతగా రూ.300 కోట్లు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు నిరుద్యోగ యువతకూ మంత్రిమండలి గుడ్ న్యూస్ చెప్పింది. కరీంనగర్ జిల్లా గంగాధరలోని డిగ్రీ కళాశాలలో నియామకాలకు పచ్చజెండా ఊపింది. 20 రెగ్యులర్ టీచింగ్ పోస్టులు, 6 నాన్ టీచింగ్ పోస్టులు, అవుట్ సోర్సింగ్ పద్ధతిన మరో 3 పోస్టుల మంజూరుకు ఆమోదం తెలిపింది. మహబూబాబాద్ జిల్లా కె.సముద్రం అగ్నిమాపక కేంద్రానికి సంబంధించి 18 పోస్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

జూనియర్ కాలేజీల్లో మహద్యాహ్న భోజనం

గంగాధర కాలేజీలో పోస్టుల భర్తీకి ఆమోదం

కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరు

తెలంగాణ కేబినేట్కీలక నిర్ణయం




## వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలగకుండా చూడాలి:



మిగతాది 2లో

## సీఏలు పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదు:



హైదరాబాద్: చార్టర్డ్ అకౌంటెంట్లు కేవలం పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. వ్యాపారాలను వృద్ధి చేసే సలహాదారులుగానూ ఎదగాలని ఆకాంక్షించారు. కృత్రిమ మేధను తమ వృత్తిలో భాగం చేసుకోవాలన్నారు.


మిగతాది 2లో

## పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు: మంత్రి జూపల్లి



మిగతాది 2లో

## ఫ్యూచర్ సిటీపై హరీశ్‌రావు వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం: శ్రీధర్ బాబు



మిగతాది 2లో

# మున్సిపాలిటీల్లో "ఆపరేషన్ క్లీన్ స్వీప్" ప్రారంభం



- రాష్ట్రాన్ని పరిశుభ్రంగా, డంప్‌యార్డ్ రహితంగా మార్చడమే లక్ష్యం
- ప్రజలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో 4 వారాల పాటు నిర్వహణ
- విజయవాడలో బెలూన్లు ఎగురవేసి ప్రారంభించిన మంత్రి నారాయణ
- పారిశుధ్య కార్మికులతో కలిసి రోడ్లు ఊడ్చిన ప్రజాప్రతినిధులు
- భవిష్యత్తులో డంప్‌యార్డ్స్ లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

మిగతాది 2లో

## పర్యాటక రంగంలో ఉపాధికి సువర్ణావకాశం: జిల్లా కలెక్టర్ అంకిత ఐఏఎస్

### యువతకు పర్యాటక శాఖ ప్రత్యేక సర్టిఫికెట్




**కోర్సులు**

**మన మహతి న్యూస్ కొత్తగూడెం**

ప్రజా పాలన -- ప్రకృతి ప్రణాళిక తొంభై తొమ్మిది రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల పద్దెనిమిదో తేదీ నుండి ఇరవై మూడో తేదీ వరకు పర్యాటక వారోత్సవాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆధ్వర్యంలో "తెలంగాణ పర్యాటక యాత్ర" కార్యక్రమాన్ని వారి కార్యాలయంలో ప్రారంభించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యువతకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మ్యూజియం నిర్వహణ మరియు పురావస్తు శాస్త్రంపై ప్రత్యేక ధ్రువపత్ర కోర్సులు అందిస్తున్నట్లు తెలిపారు. పర్యాటక రంగంపై ఆసక్తి ఉన్న యువత ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఉపాధి అవకాశాలు పొందాలని సూచించారు. ఈ కోర్సులకు సంబంధించిన పూర్తి వివరాల కోసం మ్యూజియంల ఉప సంచాలకులు డాక్టర్ పి. నాగరాజును సంప్రదించాలని తెలిపారు. సంప్రదింపు సంఖ్యలు : 9849905722, 9849905723. ఈ-మెయిల్ : ఖతీఎష్ఠ్రువశీశ్రీశీస్త్రఎఎష్ట్రఏస్త్రఖ్మఅశ్రీ.ఎశీఎ అని జిల్లా పర్యాటక అధికారి పరంధామ రెడ్డి వెల్లడించారు.



## మంత్రి వాకిటి శ్రీహరి కృషితో దశాబ్దాల కల సాకారం దిశగా.. జక్కన్నపల్లి బీటీ రోడ్డు పనులు

**మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా.**

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు నర్వ నుండి జక్కన్నపల్లి గ్రామం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్నయ్య సాగర్ , ఏ. ఏం సి వైస్ చైర్మన్ కృష్ణ రెడ్డి మండల నాయకులు మరియు జక్కన్నపల్లి గ్రామ ప్రజలు కలిసి పరిశీలించారు. దాదాపు కొన్ని దశాబ్దాలుగా గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్న రహదారి కల త్వరలో నెరవేరబోతుండటంతో గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది. ఎన్నో ఏళ్లుగా సరైన రహదారి లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ బీటీ రోడ్డు ఎంతో ఉపయోగకరంగా మారనుంది.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రోడ్డు పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

ఈ బీటీ రోడ్డు పూర్తయితే జక్కన్నపల్లి గ్రామానికి రాకపోకలు సులభతరం కావడంతో పాటు గ్రామ అభివృద్ధికి కొత్త ఊపు రానుంది.

ఈ కార్యక్రమంలో. జక్కన్న పల్లె గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామన్ గౌడ్ ,నర్వ మండల కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షులు బద్దిపల్లి రాజారెడ్డి మండల నాయకులు,బీసం రామకృష్ణ గారు, వెంకట్రాంరెడ్డి , నర్వ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పి .అశోక్ గౌడ్ బోయపాటి నరసింహ, ముష్టిపల్లి శ్రీకాంత్ రెడ్డి , తెలుగు సత్తన్న,గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ యువకులు, ప్రజలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## సంగారెడ్డి కొత్త బస్టాండ్ జనప్రియ హోటల్ లో శ్రీకాంత్ పవార్ అనే వ్యక్తి అనుమానస్పద మృతి..



**సంగారెడ్డి, మే 23,మన మహతి న్యూస్ :**

జనప్రియ హోటల్ ఉద్యోగి అనుమానాస్పద మృతి.. సంగారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న జనప్రియ ఉడిపి హోటల్‌లో పనిచేస్తున్న శ్రీకాంత్ పవార్ అనే వ్యక్తి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందాడు. మృతుడు కంగ్టి మండలం చింతామణి తండాకు చెందినవాడిగా గుర్తించారు. హోటల్ గదిలో మృతదేహం లభ్యమవడంతో ఆసుపత్రికి తరలించిన హోటల్ యాజమాన్యం, విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు హోటల్ ఎదుట ఆందోళనకు దిగారు. ఘటన స్థలంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మున్సిపాలిటీల్లో "ఆపరేషన్ క్లీన్ స్వీప్" ప్రారంభం

మొదటిపేజీ తరువాయి




రాష్ట్రాన్ని పరిశుభ్రంగా, డంప్‌యార్డ్ రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మున్సిపల్ వ్యవహారాల శాఖ నాలుగు వారాల ప్రత్యేక స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. విజయవాడ కూర్మయ్య బ్రిడ్జి వద్ద నిర్వహించిన "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, కలెక్టర్ లక్ష్మీశతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులతో కలిసి మంత్రి రోడ్లు ఊడ్చారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**నాలుగు వారాల కార్యాచరణ ప్రణాళిక**

ఈ కార్యక్రమంలో మొదటి వారంలో రోడ్లు, పబ్లిక్ ప్రదేశాల శుభ్రత చేపడతారని మంత్రి నారాయణ తెలిపారు. రెండో వారంలో కాలువల క్లీనింగ్, మూడో వారంలో చెత్త వర్గీకరణపై అవగాహన, నాలుగో వారంలో పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రత నిర్వహిస్తారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గత ప్రభుత్వం వదిలేసిన లెగసీ వ్యర్థాలను రికార్డు స్థాయిలో తొలగించామని, మిగిలిన భూగర్భ చెత్తను వచ్చే జూన్ నాటికి క్లియర్ చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో చెత్తను విద్యుత్‌గా మార్చే వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

**ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యం**

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్రతలో దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎనిమిది వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు, 107 వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ కోసం 2000 ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగంలోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. గత సంవత్సరం స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో రాష్ట్రానికి ఐదు అవార్డులు లభించాయని, ఈసారి మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**నగర పరిశుభ్రత అందరి బాధ్యత**

మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, నగర పరిశుభ్రత కేవలం పారిశుధ్య కార్మికుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు, యువత పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. చెత్తను రోడ్లపై, కాలువల్లో వేయకుండా డస్ట్ బిన్లలో వేయాలని సూచించారు. స్వచ్ఛాంధ్ర ద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగుపడి రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫ్యూచర్ సిటీపై హరీశ్‌రావు వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం: శ్రీధర్ బాబు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలా? వద్దా? ఆయన చెప్పాలన్నారు. "ఇలా చేస్తే పెట్టుబడులు రావు. పక్క రాష్ట్రాలకు వెళ్తాయి. ఫ్యూచర్ సిటీలో కాలుష్యకారక పరిశ్రమలు ఉండవు. దాన్ని రద్దు చేస్తామనడం ఎంత వరకు సమంజసం?" అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని బీఆర్ఎస్ అడ్డుకుంటోందని మంత్రి ఆరోపించారు. ఆ పార్టీ బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు యత్నిస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటిరోజు నుంచే బీఆర్ఎస్ నేతలు విమర్శలే ప్రధాన అంశంగా ముందుకెళ్తున్నారని తెలిపారు. జంట నగరాలకు సంబంధించిన మెట్రోను విస్తరించాలనుకుంటే అడ్డుకుంటున్నారని ఆరోపించారు.


## పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు: మంత్రి జూపల్లి

మొదటిపేజీ తరువాయి

గచ్చిబౌలి: తెలంగాణను పర్యాటకుల గమ్యస్థానంగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. పర్యాటక రంగమంటే కేవలం వినోదం మాత్రమే కాదని.. దేశ, రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చే అద్భుత శక్తి అని పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నితం)లో 'డెస్టినేషన్ తెలంగాణ - రోడ్ అహెడ్' పేరిట నిర్వహించిన ప్రత్యేక సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు."రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రైవేటు భాగస్వామ్యం అత్యంత కీలకం. పారిశ్రామికవేత్తలు కొత్త ఆవిష్కరణలు, సృజనాత్మక ప్రతిపాదనలతో ప్రభుత్వం వద్దకు రావాలి. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం ఉంటుంది. ప్రభుత్వ పరిధిలోని నిరర్థక ఆస్తులను పర్యాటక ప్రాజెక్టుల నిర్వహణకు దీర్ఘకాలిక లీజుకు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఎంపిక చేసిన పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి త్వరలోనే 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్' ప్రకటనలు జారీ చేస్తాం. దీని ద్వారా ఎంపికయ్యే సంస్థలకు సంబంధించిన డిజైన్లు, ప్రాజెక్టుల వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. పర్యాటక ప్రాంతాల్లో తాగునీరు, టాయిలెట్లు, వసతి గృహాల వంటి సమస్యలను అధిగమించేందుకు ప్రైవేటు వ్యక్తులు ముందుకు రావాలి" అని మంత్రి జూపల్లి పిలుపునిచ్చారు.

## సీఏలు పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదు:

మొదటిపేజీ తరువాయి



గచ్చిబౌలిలో 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా' స్నాతకోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో సీఏల పాత్ర అత్యంత కీలకమని.. ట్యాక్స్‌లు, జీఎస్టీ, వ్యాపారాల విస్తరణలో వారి అవసరం చాలా ఉందన్నారు. సీఏలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయన సత్కరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల త్యాగాలను, కష్టాన్ని ఎప్పటికీ మరువకూడదని.. వారిని ఎల్లప్పుడూ గౌరవించాలని సూచించారు.

## ప్రధాని మోదీతో అమెరికా విదేశాంగ మంత్రి రూబియో భేటీ

మొదటిపేజీ తరువాయి

శనివారం ఉదయం అమెరికా నుంచి నేరుగా కోల్‌కతా చేరుకున్న రూబియో.. మదర్ థెరీసా స్థాపించిన మిషనరీస్ ఆఫ్ ఛారిటీని సందర్శించారు. సతీమణి జీనెట్‌తో కలిసి అక్కడికి వెళ్లిన ఆయన థెరీసాకు నివాళులర్పించారు. అనంతరం ఆమె సేవా తత్వాన్ని కొనియాడుతూ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. భారత్ పర్యటనలో భాగంగా మే 26న దిల్లీలో జరగనున్న క్వాడ్ (ఝబఝు) కూటమి విదేశాంగ మంత్రుల సమావేశంలో రూబియో పాల్గొననున్నారు. ఈ కూటమిలో భారత్ సహా ఆస్ట్రేలియా, జపాన్, అమెరికాలు భాగస్వాములుగా ఉన్న సంగతి తెలిసిందే.

## పదేళ్ల బాలిక హత్యోదంతం..

మొదటిపేజీ తరువాయి

ఈ కేసులో త్వరిత గతిన దర్యాప్తు పూర్తి చేసి, నిందితులకు కఠిన శిక్ష పడేలా చేస్తామని హామీ ఇచ్చారు. టీవీకే ఎమ్మెల్యే ఎన్‌ఎం కుమార్ ఆసుపత్రి వద్ద బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

**రాజకీయంగా దుమారం..**

చిన్నారి హత్య ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 12 రోజుల్లోనే రాష్ట్రంలో నేరాల గ్రాఫ్ పెరిగిందని డీఎంకే విమర్శలు గుప్పించింది. ఈ ఘటన రాష్ట్రంలోని శాంతిభద్రతలపై తీవ్ర సందేహాలను రేకెత్తిస్తోందని ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ అన్నారు. బాలిక హత్యకు బాధ్యులైనవారిని వీలైనంత త్వరగా న్యాయస్థానం ముందు నిలబెట్టి.. కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. మహిళలకు భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చి విజయ్ అధికారంలోకి వచ్చారని.. ఇప్పుడు వారికి భద్రత ఎక్కడుందని ప్రశ్నించారు.

ఈ ఘటనపై భాజపా నేత నారాయణన్ తిరుపతి మాట్లాడుతూ.. ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని గత ప్రభుత్వం రాష్ట్రంలో శాంతిభద్రతలను పూర్తిగా నాశనం చేసిందని దుయ్యబట్టారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కోయంబత్తూర్‌లోని కణ్ణపాళైయానికి చెందిన 10 ఏళ్ల బాలిక గురువారం సాయంత్రం దుకాణానికి వెళ్లి అదృశ్యమైంది. తల్లిదండ్రులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభ్యంకాలేదు. శుక్రవారం ఓ చెరువులో బాలిక మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఓ వ్యక్తి బాలికను బైక్‌పై ఎక్కించుకొని వెళ్లినట్లు విచారణలో తేలడంతో అతడితో పాటు మరో అనుమానితుడిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

## మోదీ గిఫ్ట్‌గా ఇచ్చిన తామరాకు టీ వెనక స్టోరీ తెలుసా?

మొదటిపేజీ తరువాయి

సాధారణంగా ప్రపంచస్థాయి నేతలు ఖరీదైన కానుకలను ఇచ్చిపుచ్చుకుంటారు. అయితే మోదీ మాత్రం మణిపుర్‌లోని కొండలు, చిత్తడి నేలల నుంచి సేకరించిన టీపొడిని ఇవ్వడం విశేషం. లోక్‌తక్ లేక్.. ఈశాన్య భారతంలోని ఓ మంచి నీటి సరస్సు. ఆ ప్రాంతం ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరు. ఆ నీటిలో సహజంగా దొరికే తామర ఆకుల నుంచి ఈ టీపొడిని తయారు చేస్తారు. మణిపుర్‌లోని థంగా గ్రామంలోని కొందరు మహిళల ఆలోచన నుంచే ఈ టీ పుట్టింది. ఈ సరస్సు దెబ్బతినకుండా ఎంతో జాగ్రత్తగా ఈ ఆకులను సేకరిస్తారు. ఆ స్వచ్ఛమైన నీరు, సారవంతమైన నేలలు, జీవవైవిధ్యం వల్ల ఆ టీకి ప్రత్యేకమైన రుచి, సువాసన చేకూరి ప్రత్యేకంగా నిలిపాయి. ఇలాంటి గిఫ్ట్‌ను మోదీ ఎంచుకోవడం వెనక ప్రత్యేక కారణమే ఉంది. ఈశాన్య రాష్ట్రాల్లో తయారవుతున్న ఇలాంటి ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం కల్పించడమే అసలు ఉద్దేశం.

టీ.. స్పెషాలిటీ ఏంటో తెలుసా..?

ఇక, ఈ టీతో పాటు స్వీడన్ ప్రధానికి చేతితో తయారు చేసిన శాంతినికేతన్ లెదర్ బ్యాగ్, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచనలను బహూకరించారు. ఇవిగాక.. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి మణిపుర్ (మీఖఅఱజూబతీ)లో తయారయ్యే షిరుయ్ లిలీ పట్టు దుపట్టాను అందించారు. ఇటలీ అధ్యక్షుడు సెర్గియె మాటరెల్లీకి పండిట్ భీమ్‌సేన్ జోషి, కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎంఎస్ సుబ్బులక్ష్మి ఆలపించిన పాటల సీడీలను మార్బుల్‌తో తయారు చేయించిన ప్రత్యేక డబ్బాలో ఉంచి కానుకగా ఇచ్చిన సంగతి తెలిసిందే. మోదీ ఇచ్చిన కానుకల్లో మణిపుర్‌లో పండించే బ్లాక్‌రైస్‌కూడా ఉంది.

## 50 అత్యంత వేడి నగరాలు భారత్‌లోనివే

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: దేశంలో భానుడి ఉగ్రరూపానికి ప్రజలు అల్లాడుతున్నారు. శుక్రవారం ఉదయం దాదాపు 11 గంటల సమయానికి నమోదైన ఉష్ణోగ్రతలను బట్టి చూస్తే.. ప్రపంచంలోనే 50 అత్యంత వేడి నగరాలన్నీ భారత్‌లోనే ఉన్నాయి. ఈ గణాంకాలను ఎయిర్‌క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) వెల్లడించింది. జాబితాలోని సగం నగరాలు ఉత్తర్‌ప్రదేశ్‌లోనివే కావడం గమనార్హం. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, బిహార్, తెలంగాణ, హరియాణా, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలూ ఇందులో ఉన్నాయి.

రానున్న వారం రోజులూ తీవ్రమైన వడగాలులు: రానున్న వారం పాటు తెలుగు రాష్ట్రాలు సహా వాయవ్య, మధ్య, తూర్పు భారత్‌లోని కొన్ని మైదాన ప్రాంతాల్లో తీవ్రమైన వడగాలులు వీచే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శుక్రవారం తెలిపింది. ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్, హరియాణా, చండీగఢ్, దిల్లీ, రాజస్థాన్‌లలోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని అంచనా వేసింది. విదర్భ, ఆంధ్రాలోని తీరప్రాంతం, యానాం, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిశా, తెలంగాణ, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలోనూ వడగాలులు వీచే అవకాశముందని తెలిపింది.

## వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలగకుండా చూడాలి:

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలగకుండా చూడాలని.. ఈ మేరకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధప్రకాశ్ సూచించారు. కంపెనీ పంపులతో పాటు కొన్ని ప్రైవేటు పంపులను కూడా ఏర్పాటు చేసి.. నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఆదేశించారు. వర్షాకాలంలోనూ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గును సరఫరా చేయాలన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశం మేరకు ఆయన శనివారం జీఎంలతో సమీక్ష నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ప్రతి ఏరియా సాధించిన బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపుపైనా సమీక్షించారు. "హాల్ రోడ్లను పటిష్ఠపరచుకోవాలి. స్థానికంగా వాతావరణ విభాగం జారీ చేసే సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. భారీ యంత్రాలతో పూర్తి పని గంటలను సద్వినియోగం చేసుకోవాలి.

# తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి కి

## గిరిజనుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బంజారా సంక్షేమ సంఘం నాయకులు విన్నపం.

**వరంగల్ జిల్లా మే 22 న్యూస్**

బంజారా సంక్షేమం సంఘం తరపున తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి గారికి గిరిజన సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుకుంటూ

1. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో గిరిజనులకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తూ గిరిజన ప్రజాప్రతినిధి మంత్రి పదవి కేటాయించి పూర్తి క్యాబినెట్ హోదా కల్పించాలి

2. బంజారాల ఆరాధ్య దైవం,ఆధ్యాత్మిక గురువు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ గారి పేరుతో ప్రత్యేక "సంత్ సేవాలాల్ కార్పొరేషన్" ఏర్పాటు కోసం క్యాబినెట్లో ప్రకటించి, వెంటనే కార్పొరేషన్ను ఏర్పాటు చేసి అవసరమైన నిధులు కేటాయించాలి. 3.గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక "ఎస్టీ కమిషన్" ఏర్పాటు చేసి ప్రత్యేక హోదా కల్పించాలి

3. ఐటీడీఏలు లేని గిరిజన ప్రాంతాలలో ప్రత్యేక "ప్లెయిన్ ఏరియా డెవలప్మెంట్ ఏజెన్సీ" ఏర్పాటు చేసి, అభివృద్ధి కోసం నిధులు కేటాయించలి

4. గిరిజనుల అభివృద్ధి కోసం ట్రైబల్ సబ్ ప్లాన్(ద్వారా )నిధులను కేటాయించలి, 2018 సంవత్సరం నుండి పెండింగ్లో ఉన్న సబ్సిడీలు మరియు ఆర్థిక సహాయాలను వెంటనే విడుదల చేయాలి

5. గిరిజన ఉద్యోగస్తులకు వివిధ శాఖలలో పెండింగ్లో ఉన్న పదోన్నతులను వెంటనే పరిష్కరించాలి.

6.ఎస్టీ గ్రామ పంచాయతీలకు రెవెన్యూ జి. పి లుగా ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలు, అభివృద్ధి చేయాలి

7.ట్రైబల్ ఏరియాలతో పాటు ప్లేన్ ఏరియాలలో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు కూడా "ఇందిరమ్మ ఇండ్లు" పథకంలో ప్రతి నియోజకవర్గానికి అదనంగా 1000 ఇళ్లను కేటాయించాలి. బంజారా సంక్షేమ సంఘం తరపున ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి గారికి గిరిజన సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ బంజారా సంక్షేమ సంఘం నాయకులు ప్రొఫెసర్ జి.వీరన్న నాయక్, గౌరవ అధ్యక్షులు, గూగులోత్ సజ్జన్ నాయక్, అధ్యక్షులు,వా. దాస్య నాయక్ , రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి గారికీ గిరిజనుల సమస్యలు తప్పకుండా పరిష్కరించాలని కోరుచున్నారు.

# పదవి కోసం కాదు..ప్రజల కోసం రాజకీయాలు"

- **ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు కావాలి అని లంబాడీల ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్ డిమాండ్**



**హనుమకొండ జిల్లా మే 22 న్యూస్**

ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే నాయకత్వం కాకుండా, ఎప్పుడూ ప్రజల మధ్య ఉండే నాయకత్వం కావాలని ప్రజలు కోరుకుంటున్న ఈ తరుణంలో ఆయన వ్యవహార శైలి ప్రత్యేకంగా కనిపిస్తోంది. గ్రామ సభలు, రైతు చర్చలు, బాధిత కుటుంబాల ఆర్థిక సహాయం పరామర్శలు---ఏ కార్యక్రమమైనా ఆయన స్వయంగా హాజరవుతూ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు. "ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు ప్రజల మధ్య ఉండాలి. సమస్యలు వచ్చినప్పుడు స్పందించాలి. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ఓట్ల కోసం రావడం నాయకత్వం కాదు" అంటూ లావుడియా పల్లవి రాజు నాయక్ లంబాడీల ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఘాటుగా స్పందిస్తున్నారు.

స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పై ప్రజా అసంతృప్తి..

ఇదే సమయంలో స్థానిక ఎమ్మెల్యే మంత్రి వైఖరిపై నియోజకవర్గంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. నెలల తరబడి నియోజకవర్గంలో కనిపించకపోవడం, ప్రజా సమస్యలపై స్పందన లేకపోవడం, రైతుల పరిస్థితిపై కనీసం అధికారులను అడిగి తెలుసుకున్న పరిస్థితి కూడా లేకపోవడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాలనా వైఫల్యాలను ఎండగడుతూ మన లావుడియా పల్లవి రాజు నాయక్ ప్రజల గొంతుకగా మారుతున్నారు.

రాజకీయంగా చూస్తే వరంగల్ హనుమకొండ లో బీఆర్ఎస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా ఎర్రబెల్లి దయాకర్ రావు, దాస్యం వినయ్ భాస్కర్, ఆరూరి రమేష్, నన్నపునేని నరేందర్, రాజయ్య, ఏనుగుల రాకేష్ రెడ్డి, లావుడియా రవి నాయక్, అడుగులు పడుతున్నాయి. పదవి లేకపోయినా ప్రజల కోసం నిరంతరం పోరాడుతున్న ఆయన తీరుతో, ప్రస్తుతం హనుమకొండ వరంగల్ రాజకీయాల్లో "ప్రజల మధ్యే ఉండే నాయకుడు ఎవరు" అనే ప్రశ్నకు ఒకే ఒక్క సమాధానం వినిపిస్తోంది... ప్రతి నియోజకవర్గంలో దయాకర్ రావు, దాస్యం వినయ భాస్కర్, ఆరూరి రమేష్, నన్నపునేని నరేందర్, డాక్టర్ రాజయ్య, శంకర్ నాయక్, గ్రామ ప్రజలు కోరుకునే నాయకులు మాజీ ఎమ్మెల్యేలు పేరు వినిపిస్తున్నాయి.

# మట్టి రోడ్లను బిటీ రోడ్లుగా మార్చాలని కోరుతూ ఈనెల 25న జరుగు సిపిఎం బైక్ యాత్రను విజయవంతం చేయాలి

**మన మహతి న్యూస్. ప్రతినిధి నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం.**



మాగనూరు మండల పరిధిలోని కొత్తపల్లి నుండి తాళంకేరి, కొత్తపల్లి నుండి దుప్పల్లి ప్రస్తుతం ఉన్న బండ్ల బాటలు, నక్ష లో ఉన్న బాటలను మట్టి రోడ్లుగా మార్చాలని సిపిఎం పార్టీ మక్తల్ ఏరియా కార్యదర్శి పుంజనూర్ ఆంజనేయులు డిమాండ్ చేయడం జరిగింది మాగనూరు మండల కేంద్రం ఎన్ హెచ్ 167 నుండి వర్కూరు నేరడగం మీదిగా ఉజ్జెల్లి బైరంపల్లివరకు రోడ్డు మరమ్మత్తులు చేసి డబల్ రోడ్డు నిర్మాణం చేయాలని మాట్లాడడం జరిగింది, బీటీ రోడ్ల నుంచి గ్రామాలకు ఉన్న, వ్యవసాయ పొలాలకు వెళ్లే దారులను ఉపాధి హామీ పథకం కింద అభివృద్ధి పరచాలని కోరుతూ మే 25 సోమవారం రోజు మక్తల్ నుంచి ఉదయం 9 గంటలకు బైక్ యాత్ర ప్రారంభమవుతుందని సిపిఎం మక్తల్ ఏరియా కార్యదర్శి పుంజనూర్ ఆంజనేయులు, తెలిపారు, వర్కూర్ సర్పంచ్ లక్ష్మప్ప చేతుల మీదుగా కరపత్రం రిలీజ్ చేస్తూ ప్రజలు నిత్యం ప్రయాణం చేసే రహదారుల పైన ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని విమర్శించారు.

అనారోగ్య సమస్యలు, అత్యవసర పనులకు నారాయణపేట జిల్లా కేంద్రంకు ప్రజలు రావాలంటే గుంతల రహదారుల వెంబడి ప్రయాణం నరకప్రాయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

15 రోజుల్లో వర్షాకాలం ప్రారంభమైతే ఇంకా రోడ్డుపై ప్రయాణం చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇట్టి కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు భరత్ కుమార్ కొత్తపల్లి వడ్డే రాజు భూమానంద్ మారెప్ప ఆనంద్ రాము తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులుగా గా తిప్పర్తి శ్రీధర్



కాంగ్రెస్ పార్టీ మహబుబాబాద్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులుగా గా మహబూబాబాద్ పట్టణంలోని గుమ్ముదురు ప్రాంతానికి చెందిన తిప్పర్తి శ్రీధర్ ఎంపికయ్యారు. శుక్రవారం హైదరాబాద్ లోని గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ 33 జిల్లాల అధ్యక్షులను ప్రకటించారు. యువకులు, విద్యావం తులు, సామజిక స్పృహ కలిగిన వారికి ప్రాధాన్యత కల్పిం చినట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో,దళిత ఉద్యమల్లో విద్యార్థి దశ నుండి తెలంగాణ ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్ర పోషించారు. గతంలో ఎన్ ఎస్ యు ఐ , యువజన కాంగ్రెస్ లో పని చేశారు అని గత ఎన్నికల్లో పార్లమెంట్ ఇంచార్జ్ గా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి బాధ్యతలు కల్పించడం సంతోషంగా ఉందని అన్నారు. అగ్ర నాయకులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధిల ఆదేశాలకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తనని నాకు ఈ యొక్క పదవి రావడానికి కృషి చేసిన రాష్ట్ర ఎస్సీ విభాగం అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ,పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,రాష్ట్ర మంత్రులు సీతక్క,పొంగులేటి శ్రీనివాసరెడ్డి,ఎంపీలు వేం నరేందర్ రెడ్డి,బలరాం నాయక్,డీసీసీ అధ్యక్షులు,శ్రీమతి ఉమా మురళి నాయక్,జిల్లా ఎమ్మెల్యేలు డాక్టర్ మురళి నాయక్,విప్ రాంచంద్రనాయక్ కోరం కనకయ్య,యశస్విని రెడ్డి,గ్రంధాలయ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి గారాలకు కృతజ్ఞతలు తెలిపారు.

ది తిప్పర్తి శ్రీధర్
అధ్యక్షులు
ఎస్సీ విభాగం మహబూబాబాద్ జిల్లా
mobile: 9492910830

# తాళంకేరి గ్రామం లో 20 లక్షల రూపాయలతో సిసి రోడ్లు.ప్రారంభం.

**మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం.**




మాగనూరు మండలం తాళంకిరి గ్రామం ఏకగ్రీవమైన తాలంకేరి గ్రామ పంచాయతీ" కి ? 20 లక్షల రూపాయలు సీసీ రోడ్లు ప్రారంభం..

మంత్రి వర్యులు వాకిటీ శ్రీ హరి ఆదేశానుసారం మాగనూరు మండలం తాళం కేరి గ్రామానికి ఏకగ్రీవమైనందుకు 20 లక్షల రూపాయలను మంత్రిగారు మంజూరు చేయడం జరిగింది మంజూరు చేసిన సిసి రోడ్డును నేడు మాగనూరు మండల అధ్యక్షులు ఆనంద్ గౌడ్ ప్రారంభోత్సవం చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ బన్నమ్మ ఉ నర్సింలు మరియు మండల నాయకులు శివరాం రెడ్డి నేరేడుగం దొడ్డి సర్పంచ్ వెంకటప్ప మరియు గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ వార్డ్ మెంబర్లు ఇందిరమ్మ కమిటీ సభ్యులు గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నరసింహ మరియు ఇతర నాయకులు మహిళలు గ్రామ ప్రజలు పాల్గొని 20 లక్షల సి సి రోడ్డు మంజూరు చేసినందుకు మంత్రివర్యులు వాకిటి శ్రీహరి కి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది..

# డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్ ను మరియదాపూర్ణ కలిసిన

- ఎల్ హెచ్ పి ఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బానోత్ సునీల్ నాయక్, ప్రవీణ్, శ్రీను.





**హైదరాబాద్ మే 22 న్యూస్**

హైదరాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్స్ లో తెలంగాణ ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రు నాయక్ ని కలిసినా లంబాడ హక్కుల పోరాట సమితి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు బీసీ సంఘం రాష్ట్ర సెక్రటరీ ప్రవీణ్ ముదిరాజ్ తో పాటు శీను కలిసి త్వరలో జరగ బోయే మంత్రి వర్గ విస్తరణ లో ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ కి మంత్రి పదవి రావాలని కోరుకుంటూ పుష్పగుచ్చం తో పాటు శాలువా ని బహుకరించారు తాతనంతరం సునిల్ నాయక్ మాట్లాడుతూ ఈ తెలంగాణ రాష్టం లో కాంగ్రెస్ అధికారంలో రావడానికి లంబాడి, గిరిజనులు మరియు దళిత బీసీ ల ఓట్లు కీలకం అని చెప్పడం జరిగింది. ఇప్పటివరకు ఒక్క మంత్రి పదవి కూడా లంబాడీస్ కి ఇవ్వలేదని కావున త్వరలో జరిగే మంత్రి వర్గ విస్తరణ లో కాంగ్రెస్ సైనికుడు అయినా అటు వంటి వారు డాక్టర్ రాంచంద్రు నాయక్ కి మంత్రి పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి కి మనస్ఫూర్తిగా వినవించు కుంటున్నాము ఈ కార్యక్రమం లో లంబాడ హక్కుల పోరాట సమితి శ్రేణులు పాల్గొన్నారు భానోత్ సునిల్ నాయక్ లంబాడి హక్కుల పోరాట సమితి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ నంగారాభేరి.

# మెగా వైద్య శిబిరం లో ముఖ్య పాల్గొన్న రఘునాథ్ యాదవ్

**శేరిలింగంపల్లి మన మహతి న్యూస్ మే 23:**





మియాపూర్ లోనీ బీకే కమ్యూనిటీ హాల్ వద్ద యలమంచి ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరం కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనంతరం మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ హాస్పిటల్ వారు అందించిన సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉదయ్ కిరణ్ ని ఇలాంటి సేవలు మరెన్నో చేయాల్సిందిగా వారిని అభినందనలు తెలియజేస్తూ ఈ కార్యక్రమంలో సహకరించిన కమిటీ సభ్యులకు , స్థానిక ప్రజలకు అభినందనలు తెలియజేశారు.

# దేహమే దేశం. ధర్మమే ప్రాణం.

**కోస్గి జ్ఞానపీఠం రఘోతమాచారి**

**మన మహతి. న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా..**



ఉట్కూరు మండలం. బిజ్వార్. గ్రామం.దేశమే దేహం..ధర్మమే ప్రాణం"అనే నినాదంతో హిందువులంతా కదులుదామని కోస్గి జ్ఞానపీఠం రఘోతమాచారి అన్నారు.మండల పరిధిలోని బిజ్వార్ లో వెలసిన శ్రీ వ్యాసరాయల మహర్షిచే ప్రతిష్టించిన శ్రీ పడమటి ఆంజనేయస్వామి దేవాలయాన్ని శనివారం ఆయన దర్శించుకుని మాట్లాడారు.హిందూ సమాజంలో ఐక్యతా,చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రతి హిందువు బాధ్యత వహించాలని పేర్కొంటూ,గోరక్షణ,వేదాలు, ఉపనిషత్తులు,హిందూ సంప్రదాయాలు,ఆచార వ్యవహారాలు ప్రతి ఒక్క హిందూ పాటించాలన్నారు. ముఖ్యంగా నేటి యువత భారతీయ సంస్కృతి,సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు.హిందూ సమాజం ఐక్యంగా ఉంటేనే ధర్మ పరిరక్షణ సాధ్యమవుతుందని, సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి నరసింహ చారి జోషి, రవికుమార్ జోషి,ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు దొరోళ్ళ కృష్ణయ్య,కమిటీ సభ్యులు మహేష్ గౌడ్, సుధాకర్ రెడ్డి,కాటం నర్సింహులు గౌడ్,ఉప్పు ఆంజనేయులు,కుక్కలి వెంకటప్ప,గుడిసె శేఖర్, పోలీస్ హన్మి రెడ్డి,వెంకప్ప గౌడ్,నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**•సిపిఐ (ఎం ) జిల్లా కార్యదర్శి జీ. వెంకట్రామిరెడ్డి**

మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా కుట్మూరు మండలం ఓబులాపూర్ గ్రామం .

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీల సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని సిపిఐ (ఎం ) నారాయణపేట జిల్లా కార్యదర్శి జీ. వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు.

ఊట్కూర్ మండలం ఓబ్లాపూర్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులపై ఆయన శనివారం స్థానిక నాయకులు, కూలీలు, రైతులతో కలిసి ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామంలోని కూలీల ప్రధాన డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని ఆయన అధికారులను గట్టిగా డిమాండ్ చేశారు.



కూలీల ప్రధాన డిమాండ్లు:

బ్యాంక్ ఖాతాల మార్పిడి: కూలీలకు ప్రస్తుతం ఐసీఐసీఐ బ్యాంకులో ఉన్న అకౌంట్లను, వారికి సులభంగా అందుబాటులో ఉండేలా స్థానిక పోస్ట్ ఆఫీస్‌కు వెంటనే మార్చాలి.

కెనరా బ్యాంక్ వేధింపులు ఆపాలి: కెనరా బ్యాంకులో కూలీలు తమ కష్టార్జితాన్ని డ్రా చేసుకోవడానికి వెళ్తే.. ఖాతాలో 10,000 కంటే ఎక్కువ ఉంటేనే ఇస్తామని బ్యాంక్ సిబ్బంది మొండికేయడం అన్యాయం. ఈ నిబంధనను వెంటనే పక్కనపెట్టి కూలీల సొమ్మును వారికి అందించాలి.

కొత్త జాబ్ కార్డుల జారీ: ఊట్కూర్ మండలం ఓబ్లాపూర్ గ్రామంలో పనుల కోసం ఎదురుచూస్తున్న కొత్త కూలీలందరికీ వెంటనే కొత్త జాబ్ కార్డ్ నెంబర్లను కేటాయించి, ఉపాధి హామీ పనులను కల్పించాలి.

పెద్ద ఎత్తున పాల్గొన్న కూలీలు, రైతులు:

ఈ సందర్భంగా జీ. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. రెక్కాడితే గానీ డొక్కాడని పేద కూలీలను బ్యాంకుల చుట్టూ తిప్పుతూ మానసిక వేధనలకు గురిచేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓబ్లాపూర్ గ్రామ కూలీల సమస్యలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే సిపిఐ (ఎం ) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

హాజరైన వారు:

ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం ) కార్యకర్త పవన్ కుమార్, ఓబ్లాపూర్ గ్రామ ఉపాధి హామీ కూలీలు, స్థానిక రైతులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతును తెలిపారు.

# ప్రజా ప్రభుత్వ కామన్ సైట్ లో అక్రమ గుడి నిర్మాణం పై ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయిస్తున్న కూటమి నాయకులు

**•వారికి సహకరిస్తూ తప్పుడు నివేదికలు ఇస్తున్న కొందరు అధికారులు!**

మన మహతిప్రతినిధి:భ్రమరాంబతిరువూరు న్యూస్,మే.24

ధర్మం కోసం – ఈ అవినీతి అక్రమాలు ప్రజలకు – ప్రభుత్వానికి – ప్రభుత్వ పై ఉన్న అధికారులకు! తెలియాలని.తెలపాలని నిరాహార దీక్ష చేపడుతున్న ప్రజాపక్ష నేత మెహర్ బాబా ! దీక్షను విరమిచ్చుకో కుంటే కేసులు బనాయించి జైల్లో పెడతాం అంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్న ఒక నియోజకవర్గ అధికారి! ఈ ప్రజా ప్రభుత్వ కామన్ సైట్లో కడుతున్న గుడి అక్రమ నిర్మాణం పై ఇచ్చిన ఫిర్యాదు మేరకు! ఏనాడైనా నేటికీ కలెక్టర్ వారైనా రెవెన్యూ డివిజనల్ అధికారైన ఎంక్వైరీ కొచ్చి అసలు ఏమి జరిగిందని పరిశీలించారా? గత ప్రభుత్వంలో వైసీపీ ప్రభుత్వంలో ! తెలుగుదేశం పార్టీ నాయకులు ఏదైనా సమస్యలపై ప్రశ్నిస్తే! అక్రమ కేసులు బనాయిస్తున్నారు అని వైసిపి ప్రభుత్వం పై నిందలు వేసేవారు! ఇప్పుడు ఈ మంచి కూటమి ప్రభుత్వం ముసుగులో తిరువూరు పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు చేసే అక్రమాలు ఏమిటి? అవి ప్రజల స్థలములో అక్రమ గుడి కట్టడాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తారా ? అవసరమైతే చంపేస్తాం అంటున్న పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు! గతంలో అక్కపాలెం దళిత



నాయకుడు దోమతోటి నాగేశ్వరరావు అక్రమాలకు అడ్డొస్తే ఏమి జరిగింది ! వీడికి అదే గతి పడుతుందని భయభ్రాంతులకు గురి చేస్తున్న పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు! ఒకవైపు రౌడీ షీటర్లు,బ్లాక్మెయిలర్లు,హనీ ట్రాపర్లు! మరోవైపు ఇప్పుడు అక్రమాలకు ఒడికడుతూ అడ్డొస్తున్నానని చంపి వేయుటకు ప్రయత్నిస్తున్న! కూటమి ముసుగులో పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు పన్నాగం! అవినీతి అక్రమాలు ప్రసంగించి అడ్డుకోవడంలో నాకు ఏ హాని జరిగినా ఈ ప్రభుత్వాన్ని ది ప్రభుత్వాధికారులది బాధ్యత! ఒక సామాజిక వేతను,ఒక జర్నలిస్టును,దళితుడనే చిన్న చూపు ఏ పార్టీ వారు అండలేరని ఈ కూటమి ప్రభుత్వం ముసుగులో! అక్రమాలకు అడ్డుస్తున్నానని పట్టణ కేసులు బనాయిస్తు తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న కుట్రలు! ప్రజా ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చినటువంటి భూములకు రక్షణ కల్పించలేని




అధికారులు! నిరాహార దీక్ష విరమించుకోకుంటే కేసులు బనాయిస్తామంటు భయభ్రాంతులకు గురిచేస్తున్న నియోజకవర్గ ఒక ఉన్నత అధికారి ! తిరువూరు నియోజకవర్గంలో తిరువూరు నగర పంచాయతీలో అవినీతి అక్రమాల తడకలు ఉన్నాయి! నియోజకవర్గ రెవెన్యూ మండల కార్యాలయాల్లో పేద సన్నకారు రైతులు ఎందరో కార్యాలయాలు చుట్టూ తిరుగుతూ ఉన్నారు! ఇవన్నీ ఈ మంచి కూటమి ప్రభుత్వం లో ఉన్న ముఖ్యమంత్రి వారి దృష్టికి తీసుకు వెళ్లడానికే ఈ నిరాహార దీక్ష! తిరువూరులో ఈ అధికారులు అడ్డుకుంటే విజయవాడ నడిగడ్డపై ధర్నా చౌకు లో ఈ దీక్ష నిర్వహిస్తా! తిరువూరు లో మరియు నియోజకవర్గ మండల పరిధిలో పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను! ఈ మంచి కూటమి ప్రభుత్వాన్ని నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి దృష్టికి తీసుకువెళతా! ప్రతిపక్ష – ప్రజాపక్ష – సామాజికవేత – మెహర్ బాబా వాసం!

## రాహుల్ గాంధీని ప్రధాని చేయాలి.రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్‌కు 300 ఎంపీ సీట్లు ఇవ్వాలి జగ్గారెడ్డి.

**- "సంవిధాన్ బచావో" నినాదం దేశ భవిష్యత్తుకు కీలకం**

**- రాజ్యాంగం దేశ ప్రజలకు కవచ కుండలాలాంటిదని వ్యాఖ్య**

**- బీజేపీ మత రాజకీయాలు, ఓటు చోరీపై తీవ్ర విమర్శలు**

సంగారెడ్డి,మే 23,మన మహతి న్యూస్ :

టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 300కు పైగా ఎంపీ స్థానాలు గెలిపించి, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత 850 పార్లమెంట్ స్థానాలు వచ్చినా, కాంగ్రెస్‌కు 500కు పైగా సీట్లు ఇవ్వాలని కోరారు.

రాహుల్ గాంధీ చేపట్టిన "సంవిధాన్ బచావో" నినాదం దేశానికి అత్యంత కీలకమని జగ్గారెడ్డి పేర్కొన్నారు. మహాభారతంలో కర్ణుడికి కవచ కుండలాలు ఎంత రక్షణగా ఉన్నాయో, భారతదేశ ప్రజలకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అంతటి రక్షణ కవచమని వ్యాఖ్యానించారు. రాజ్యాంగం బలహీనపడితే ప్రజాస్వామ్యానికి ప్రమాదమని హెచ్చరించారు.




దేశ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ, గాంధీ కుటుంబం చేసిన సేవలను గుర్తు చేస్తూ మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ పాలనలో దేశానికి పునాది వేశారని చెప్పారు. బ్యాంకుల జాతీయాకరణ ద్వారా పేదలకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చిందీ ఇందిరా గాంధీయేనని అన్నారు. ఐటీ రంగానికి బీజం వేసింది రాజీవ్ గాంధీయేనని, 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన ఘనత కూడా ఆయనదేనని తెలిపారు.

సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా కోట్లాది పేదలకు ఉపాధి కల్పించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజలు ఉపయోగిస్తున్న మొబైల్ ఫోన్ వ్యవస్థలకు కూడా రాజీవ్ గాంధీ పాలనలోనే పునాది పడిందన్నారు.

కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, బీజేపీ మతాన్ని రాజకీయాలకు వాడుకుంటోందని ఆరోపించారు. ఎన్నికల్లో ఓటు చోరీ జరుగుతోందని రాహుల్ గాంధీ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారని అన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే పరిస్థితిని బీజేపీ దెబ్బతీస్తోందని ఆరోపించారు.

దేశ అప్పుల విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని, బీజేపీ అధికారంలోకి రాకముందు రూ.54 లక్షల కోట్ల అప్పు ఉండగా, ప్రస్తుతం అది రూ.147 లక్షల కోట్లకు పెరిగిందని విమర్శించారు. గత 11 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలేమిటో చెప్పాలని ప్రశ్నించారు.

తెలంగాణలో కాంగ్రెస్‌కు 12 పార్లమెంట్ స్థానాలు ఇవ్వాలని, ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక హోదా, పోలవరం పూర్తి, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేయాలంటే కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఓటును వృథా చేసుకోవద్దని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్‌కు ఓటేయాలని కోరారు.

"కాంగ్రెస్ నా జాగీరు కాదు.. నేను పార్టీలో చిన్న ఉద్యోగిని మాత్రమే" అని వ్యాఖ్యానించిన జగ్గారెడ్డి, దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడగల నాయకుడు రాహుల్ గాంధీయేనని అన్నారు. అహంకార రాజకీయాలకు కాలమే సమాధానం చెబుతుందని వ్యాఖ్యానించారు.

# యువజనోత్సవాల్లో ఉద్యోగ నియామక పత్రాలు, ప్రతిభావంతులకు పతకాల ప్రదానం

మన మహతి న్యూస్ పాల్వంచ

99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుండి 23 వరకు యువజనోత్సవ వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం పలు కార్యక్రమాలు చేపట్టారు.

ఈ నెల 4న ఖమ్మంలో నిర్వహించిన భారీ ఉద్యోగ మేళాలో ఉద్యోగాలు పొందిన 105 మంది యువతకు ఐ డి ఓ సి నందు జిల్లా కలెక్టర్ అంకిత్ ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు.

అలాగే ముఖ్యమంత్రి కప్--2026తో పాటు ఇతర పోటీలలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు కలెక్టర్ పతకాలు బహుకరించి అభినందించారు.పర్యాటక శాఖ రూపొందించిన తెలంగాణ ప్రచార కిట్‌ను కూడా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి పరంధామ రెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం ప్రధాన అధికారి





మధుసూదన్ రెడ్డి, ప్రజా సమాచార అధికారి పృథ్వి, ప్రశాంతి నగర్ సర్పంచ్ లైలా, శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పద్మ, ఉప ప్రిన్సిపాల్ వనజ, క్రీడా శిక్షకులు అబ్దుల్ నబి, కాశీ హుస్సేన్, నాగేశ్వర్ రావు, లగడపాటి రమేష్, వై.వి. శ్రీనివాస్, డానియల్ రాంబాబు, నవీన్, గిరి ప్రసాద్, నాగేంద్ర, జగన్నాథ్, పాపరాజు, శ్రీనివాస్, నాగ శివాజీ, మల్లికార్జున్, ప్రమీల, రవి కిరణ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ (హిల్ట్) పై విధి విధానాల ప్రకటన.

**•హిల్ట్ పాలసీ పైఅధికారికంగా విధివిధానాలను ఆన్ లైన్ లో విడుదల చేసిన పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు.**

**•పాల్గొన్న టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ఎం.డి శశాంక.**

సంగారెడ్డి, మే 23, మన మహతి న్యూస్





:హైదరాబాద్‌లోని పాత పరిశ్రమల భూములను మల్టీ-యూజ్ జోన్లుగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం హిల్ట్ పాలసీ విధివిధానాలను అధికారికంగా ఆన్ లైన్ లో విడుదల చేశారు. శనివారం సెక్రటేరియట్ లో మంత్రి శ్రీధర్ బాబు, టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి లాంఛనంగా ఆన్లైన్ లో ఈమేరకు పాలసీ విధి విధానాలను విడుదల చేశారు.

ORR పరిధిలో ఉన్న సుమారు 9,292 ఎకరాల పరిశ్రమల భూమి మార్పిడి లక్ష్యంగా ఈ పాలసీ ని రూపొందించారు.

భవిష్యత్తులో పరిశ్రమలకు సంబంధించిన ఈ భూములను నివాస ప్రాజెక్టులు,ఐటీ పార్కులు,వాణిజ్య సముదాయాలు,ఆసుపత్రులు, విద్యాసంస్థలు ఏర్పాటు చేసేందుకు వెసులుబాటు కలుగుతుంది.

శనివారం మంత్రి శ్రీధర్ బాబు, టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, టీజీఐఐసి ఎండి శశాంక లు ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న పరిశ్రమ ల యజమానుల తో సమావేశం అయ్యారు. హిల్ట్ విధి విధానాల అమలు విషయం లో వారి అభిప్రాయాల ను అడిగి తెలుసుకున్నారు. పూర్తి విధి విధానాలు ఆన్ లైన్ లో అందుబాటులో ఉన్నాయని, అవసరమైతే సలహాల కోసం టోల్ ఫ్రీ నంబర్ ను సైతం ఏర్పాటు చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

# జిల్లా సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు.

**•తాగునీరు, రోడ్లు, సాగునీరు, జొన్నల కొనుగోలు అంశాలపై వినతి.**

సంగారెడ్డి, మే 23,మన మహతి న్యూస్ :

సంగారెడ్డి జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల వేగవంతం కోసం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ను కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు.





ఈ సందర్భంగా జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ జహీరాబాద్ నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, కొత్త బోర్‌వెల్స్ మంజూరు చేసి సమస్యను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే ఎమ్మెల్యే కోటా కింద 40 శాతం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

జహీరాబాద్--గౌసాబాద్, జహీరాబాద్--బోనస్‌పూర్--తాండూర్, జహీరాబాద్--అల్గోల్, దిగ్వల్--సరసంఘం ప్రధాన రహదారులు దెబ్బతిన్నాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. పూర్తయిన వేజ్--నాన్‌వేజ్ మార్కెట్ యార్డును ప్రజల వినియోగంలోకి తీసుకురావాలని కూడా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తన నియోజకవర్గంలో నెలకొన్న ఇరిగేషన్ సమస్యలను వివరించారు. సాగునీటి ఇబ్బందులతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ జొన్నల కొనుగోలు విషయంలో రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఒక ఎకరానికి 30 నుంచి 35 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తున్నప్పటికీ ప్రభుత్వం కేవలం 10 క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేస్తోందని తెలిపారు. కనీసం ఎకరానికి 20 క్వింటాళ్ల వరకు ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

అనంతరం సంగారెడ్డి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, తాగునీరు, మౌలిక వసతుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేలకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, తట్టు నారాయణ, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, చింత సాయినాథ్, గోవర్ధన్ నాయక్, సర్పంచ్



# ఒట్టు... నేను రహస్యంగా పెళ్లి చేసుకోను!

నేను రహస్యంగా పెళ్లి చేసుకోను... ఇది నా ప్రామిస్ అంటున్నారు బాలీవుడ్ కథానాయిక కంగన. ఇటీవలే ఆమె 'క్వీన్' చిత్ర సీక్వెల్ కోసం రంగంలోకి దిగారని సన్నిహిత వర్గాలు వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఆమె వివాహిత మహిళ లుక్‌లో హడావుడిగా కారు ఎక్కుతున్న ఓ వీడియో నెట్టింట వైరల్ అయ్యింది. దీంతో కంగనా రహస్యంగా పెళ్లి చేసుకున్నారా? అంటూ సోషల్ మీడియాలో చర్చమొదలైంది. దీంతో కంగన తనదైనశైలిలో దీనికి సంబంధించి ఇన్‌స్టా స్టోరీలో బదులిచ్చారు.

"నేను చేస్తున్న క్యారెక్టర్ మేకప్‌లో ఉన్నప్పుడే ఎవరో నా ఫొటోను తీశారు. ఇప్పుడు నాకు చాలా ఫోన్ కాల్స్ వస్తున్నాయి. కానీ, పెళ్లి చేసుకున్న మహిళగా కనిపించడంలో అంత పెద్ద విషయం ఏముంది? సినిమాల్లో నటీనటులు అన్ని రకాల పాత్రలు పోషిస్తారు. నేనేమి రహస్యంగా పెళ్లి చేసుకోను, ఇది నా ప్రామిస్" అని రాసుకొచ్చారు. కంగనా 'క్వీన్' మొదటి చిత్రంలో వివాహం రద్దయి విదేశాలకు వెళ్లిన మహిళగా కనిపించారు. ఇప్పుడు వైరల్ అయిన వీడియోతో ఆమె సీక్వెల్‌లో వివాహిత స్త్రీగా కనిపించి ప్రేక్షకుల్ని అలరించనున్నారని తెలుస్తోంది.

ఏదేమైనప్పటికీ కంగనా పాత్ర గురించి పూర్తి వివరాలు తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి ఉండాల్సిందే. కంగనా తదుపరి 'భారత భాగ్య విధాత' అనే చిత్రంతో వచ్చే నెల 12న ప్రేక్షకుల్ని పలకరించనున్నారు.




# ఈరోజును జీవితంలో మర్చిపోలేను - నాగార్జున స్పెషల్ పోస్ట్

తన జీవితంలో 'మే 23' ఎప్పటికీ ప్రత్యేకమేనని అగ్ర కథానాయకుడు నాగార్జున అన్నారు. అందులోనూ ఈ ఏడాది మరీ స్పెషల్ అని తెలిపారు. తన మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలై నేటికి 40 ఏళ్లు అయిన సందర్భంగా ఆయన పోస్ట్ పెట్టారు. తనను ఆదరిస్తున్న అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు.


"అందరికీ ధన్యవాదాలు. మే 23.. నేను ఎప్పటికీ మర్చిపోలేని రోజు.. మా నాన్న చివరి చిత్రం (మనం) 2014లో ఈరోజే విడుదలైంది. నాన్నతో పాటు నాగచైతన్య, అఖిల్‌లతో నటించే అవకాశం ఆ సినిమాతోనే దక్కింది. ఇక 40 ఏళ్ల క్రితం ఇదే రోజు నా మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలైంది. మిమ్మల్ని అలరించడం కోసం, మీ ప్రేమాభిమానాలు పొందడం కోసం నేను ఇండస్ట్రీకి వచ్చాను. 'విక్రమ్' నాకు ఎంతోమంది అభిమానులను దగ్గర చేసింది. ఇన్నేళ్లుగా నాకు అండగా నిలిచిన అభిమానులందరికీ నా కృతజ్ఞతలు. భవిష్యత్తులో మరిన్ని మే 23లను ఇలానే సెలబ్రేట్ చేసుకోవాలని కోరుకుంటున్నా" అని నాగార్జున తన పోస్ట్‌లో పేర్కొన్నారు. నాగార్జున హీరోగా మధుసూధనరావు తెరకెక్కించిన చిత్రం 'విక్రమ్' 1986 మే 23న విడుదలై విజయాన్ని అందుకుంది. 1983లో బాలీవుడ్‌లో విడుదలైన 'హీరో' సినిమాకు రీమేక్‌గా రూపొందింది. ప్రస్తుతం కింగ్ తన 100వ సినిమాతో బిజీగా ఉన్నారు. తమిళ దర్శకుడు రా.కార్తీక్ తెరకెక్కిస్తున్నారు. 'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉంది. నాగార్జున ఇందులో పలు రకాల గెటప్పుల్లో కనిపిస్తారని, ఆయన పేరు చెప్పగానే శివ, రక్షకుడుతోపాటు, 'కూలీ'లో పోషించిన సైమన్ లాంటి స్టైలిష్ పాత్రలు గుర్తొస్తాయని, వాటన్నిటినీ గుర్తుచేసేలా 'కింగ్ 100' ఉంటుందని దర్శకుడు ఇటీవల తెలిపారు.



# 'జన నాయగన్' ఇప్పటికీ సెన్సార్ అవ్వలేదు: నిర్మాత

విజయ్ కథానాయకుడిగా హెచ్.వినోద్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'జన నాయగన్'. సంక్రాంతి కానుకగా రావాల్సిన ఈ సినిమా ఇప్పటికీ విడుదలకు నోచుకోలేదు. సెన్సార్ విషయంలో కోర్టుల చుట్టూ తిరగ్గా, ఫైనల్ కమిటీ ఈ మూవీని చూసి, సర్టిఫికెట్ ఇవ్వాల్సిఉంది. ఈ ప్రక్రియ ఇప్పటికీ పూర్తికాలేదని నిర్మాత వెంకట్ కె.నారాయణ అన్నారు. విజయ్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా ఈ వ్యవహారం ఓ కొలిక్కి రాకపోవడం గమనార్హం. తొలుత ఈ విషయమై స్పందించడానికి నిర్మాత నారాయణ సంశయం వ్యక్తంచేయగా, ఆ తర్వాత సెన్సార్ అవ్వలేదని స్పష్టంచేశారు."జన నాయగన్' గురించి మాట్లాడానికి ఇది సరైన వేదిక కాదు. నేను ఆలయ దర్శనానికి వచ్చాను. కానీ, ఒక విషయం చెప్పాలనుకుంటున్నా. ఇప్పటికీ సెన్సార్ సర్టిఫికెట్ రాలేదు. దానికోసమే వేచి చూస్తున్నాం. త్వరలోనే ఈ సమస్యను పరిష్కరించి, సినిమాను ప్రేక్షకుల ముందుకుతీసుకొస్తాం. ఇంతకుమించి మాట్లాడటానికి ఇది వేదిక కాదు" అని అన్నారు.

# అలాంటోడిని ఎవరూ ఓడించలేరు: పూరి జగన్నాథ్



ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ 'పూరి మ్యూజింగ్స్' పేరిట ఆసక్తికర విషయాలు పంచుకుంటున్న సంగతి తెలిసిందే. తాజా ఎపిసోడ్‌లో యాటిట్యూడ్ గురించి మాట్లాడారు. రైట్ యాటిట్యూడ్ ఉన్నోడిని ఎవరూ ఓడించలేరంటూ స్ఫూర్తినింపే ప్రయత్నం చేశారు. ఇంకా ఆయన ఏమన్నారంటే?

"నీ యాటిట్యూడ్ వల్ల నీ చుట్టూ ఉన్న ప్రపంచం మారిపోదు. కానీ, నీలోని ప్రపంచం మారుతుంది. ఒక పెను తుపానులో రెండు ఇళ్లు సముద్రంలో కొట్టుకుపోయాయి. అన్నీ కోల్పోయి ఒకడు ఏడుస్తుంటే.. ఇంకొకడు ఏదో చెట్టు కొమ్మను పట్టుకుని వేలాడుతూ నవ్వుతూ కనిపిస్తాడు. ఒకడు కుంగిపోతాడు. మరొకడు బతికాననుకుంటాడు. మీకు నెగెటివ్ మైండ్ ఉంటే దీవెనలు కూడా దరిద్రంగా అనిపిస్తాయి. అదే మీరు కాన్షియస్ మైండ్ (స్పృహతో ఉన్న మనసు)తో ఉంటే కష్టాలు కూడా అవకాశాల్లా కనిపిస్తాయి. ప్రపంచంలో ఏదీ నీకు మాత్రమే వ్యతిరేకంగా జరగదు. ప్రపంచంలో ఏవేవో జరుగుతుంటాయి. అందులో నువ్వు కూడా ఉన్నావంతే. అలాంటప్పుడే మన యాటిట్యూడ్ సాయం చేస్తుంది. ఆ తుపానులో నువ్వు బాధ పడతావా? అనుభూతి చెందుతావా? అన్నది నీ ఇష్టం. ప్రతి దానికీ కంప్లైంట్ చేసుకుంటూ పోతే నీకే నష్టం.

ఎప్పుడూ ఏడుస్తూ బతకాలి అని అనుకున్న వారికి చుట్టూ వేల కారణాలు కనిపిస్తాయి. బయట జరిగేదేదీ మన చేతిలో ఉండదు. కానీ, దానిపై ఎలా స్పందించాలనేది మాత్రం మన చేతిలోనే ఉంటుంది.

రైట్ యాటిట్యూడ్ ఉన్నోడిని ఎవరూ ఓడించలేరు. ఎందుకంటే వాడు జీవితానికి ఎదురెళ్లడు. జీవితమనే నదిలో ఒదిగిపోతూ కొట్టుకుపోతున్నాడు. వాడిని ఎవరూ ఏమీ చేయలేరు. వర్షంలో తడవాల్సి వస్తే తడువు. ఎండలో ఉండాల్సి వస్తే ఉండిపో. అప్పుడే నీలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

ప్రతి దానికీ భయపడే లక్షణం ఉంటే నెమ్మదిగా మార్చుకోండి. భయపడకపోతే ఇదే జీవితంలో మీ అనుభవం మరోలా ఉంటుంది. ఇక్కడ ఎవరూ పర్‌ఫెక్ట్ కాదు. మన క్యారెక్టర్ ఎలా ఉన్నా ఫర్వాలేదు. ఒరిజినల్‌గా ఉంటే చాలు. ఎవరి కోసమూ యాక్ట్ చేయాల్సిన పనిలేదు. మీ కాన్ఫిడెన్స్ లెవల్ మీ సింప్లిసిటీలో అర్థమవుతుంది. మన కష్టాలన్నింటినీ తట్టుకోవాలన్నా.. పడి లేవాలన్నా.. పరిగెత్తాలన్నా మనకు కావాల్సింది యాటిట్యూడ్" అని పేర్కొన్నారు.




# 'సలార్ 2' సెట్స్‌పైకి అప్పుడే!

ప్రస్తుతం ప్రభాస్ చేతిలో మూడు సినిమాలున్నాయి. వీటిలో 'ఫౌజీ' ముగింపు దశలో ఉండగా.. 'స్పిరిట్', 'కల్కి..' సీక్వెల్ చిత్రాలు ఇటీవలే చిత్రీకరణ ప్రారంభించుకున్నాయి. దీనితో పాటు 'సలార్ 2' చేయాల్సి ఉండగా.. ఇది ఉంటుందా అనే దానిపై అనేక అనుమానాలు నెలకొన్నాయి. ఇక ఇటీవల దర్శకుడు ప్రశాంత్ నీల్ తాను త్వరలో ఓ మైథలాజికల్ సినిమా చేస్తానని చెప్పడంతో 'సలార్' సీక్వెల్ ఉండకపోవచ్చేమోనన్న ప్రచారం మరింత ఊపందుకుంది. దీంతో ఈ అంశంపై దర్శకుడు ప్రశాంత్ స్పష్టత ఇచ్చారు. ప్రస్తుతం తాను ఎన్టీఆర్‌తో చేస్తున్న 'డ్రాగన్' పూర్తి కాగానే.. 'సలార్ 2' ప్రారంభమవుతుందని వెల్లడించారు. దీంతో ఇదిప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. ప్రస్తుతం ప్రశాంత్ – ఎన్టీఆర్ కలయికలో వస్తున్న 'డ్రాగన్' సినిమా వచ్చే ఏడాది ఆరంభం కల్లా పూర్తి కానున్నట్లు తెలుస్తోంది. ఈలోగా ప్రభాస్ కూడా 'ఫౌజీ'తో పాటు 'స్పిరిట్'ని ముగించే అవకాశముంది. కాబట్టి 'సలార్ 2: శౌర్యాంగపర్వం' 2027 చివరి నాటికి సెట్స్‌పైకి వెళ్లొచ్చని సంకేతాలందుతున్నాయి.



# ఆదర్శకుటుంబంలోకి నివేద!

కథానాయకుడు వెంకటేశ్.. దర్శకుడు త్రివిక్రమ్ కలయికలో రూపొందుతున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం: హౌస్ నెం 47'. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. శ్రీనిధి శెట్టి కథానాయిక. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమాలోకి కొత్తగా మరో అందం చేరినట్లు తెలుస్తోంది. నటి నివేదా పేతురాజ్ ఇందులో ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ఇది త్రివిక్రమ్‌తో ఆమెకి రెండో సినిమా. తను గతంలో ఆయన దర్శకత్వంలో 'అల.. వైకుంఠపురములో' సినిమాలోనూ ముఖ్య పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఇక ప్రస్తుతం తుది దశ చిత్రీకరణలో ఉన్న ఈ 'ఆదర్శ కుటుంబం' అక్టోబరులో తెరపైకి వచ్చే అవకాశముందని ప్రచారం వినిపిస్తోంది. ఇది కుటుంబ అంశాలతో ముడిపడిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతోంది.



Printed, Published & Owned by Boda prakash s/o krishna h.no 3-2 satyanarayana puram Edulapuram khammam rural Telanagana 507003 , Printed at Maddineni Nageshwara Rao , H.NO 1-17 18 , Svn Colony, Edulapuram, khammam rural Telanagana 507003, EDITOR : Boda prakash PH : 9000005078 & 9133935333 , RNI. NO TGTEL/26/A0372. EMAIL: manamahati@gmail.com